పంచోత్కులపల్లిలో పావువంతే!

155 మందిలో 32 మందికే రుణమాఫీ

సర్కారు అడ్డగోలు నిబంధనలతో రైతులకు నష్టం

వరంగల్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో మూడు దశల్లో రుణమాఫీ చేసినా.. పావువంతు మందికి మాత్రమే మాఫీ అయినట్టు తెలుస్తున్నది. పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క సొంత నియోజకవర్గం ములుగు కేంద్రానికి సమీపంలోని పంచోత్కులపల్లిలో రుణమాఫీకాని రైతులే ఎక్కువగా ఉన్నారు.

మంత్రి సీతక్క ఇలాకాలో రైతుకు ధోకా!

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పంట రుణాలమాఫీ ఒట్టిదేనని ములుగు జిల్లా ములుగు మండలం పంచోత్కులపల్లిలోని రైతుల పరిస్థితి చూస్తే స్పష్టమవుతున్నది. పంచోత్కులపల్లిలో 180 ఇండ్లు ఉన్నాయి. 450 మంది ఓటర్లు ఉన్నారు. పూర్తిగా వ్యవసాయమే ఆధారం. పంచోత్కులపల్లిలో 155 మంది రైతులకు వివిధ బ్యాంకుల్లో అకౌంట్లు ఉన్నాయి. ములుగు పీఏసీఎస్, జంగాలపల్లిలోని యూనియన్ బ్యాంకులో వీరంతా పంట రుణాలు తీసుకున్నారు. బ్యాంకు ఖాతాలున్న 155 మంది రైతుల్లో భార్యభర్తలకు వేర్వేరుగా అకౌంట్లు ఉన్నాయి. ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీ చేయగా, మొదటి విడతలో 12 మందికి, రెండో విడతలో 15 మందికి, మూడో విడతలో ఐదుగురికి మాత్రమే మాఫీ అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కుటుంబానికి రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేశామని ప్రకటించింది. రేషన్‌కార్డు ప్రమాణికంగా కుటుంబ నిర్ధారణ అని నిబంధనలు పెట్టింది. గ్రామాల్లో ఒకే ఇంటి పేరు ఉన్న కుటుంబాలు ఎక్కువగా ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన నిబంధనతో ఎక్కువ మంది రుణాలు మాఫీ కాలేదు. భార్య, భర్త ఒకే రేషన్ కార్డులో ఉంటారు. వీరిద్దరు వేర్వేరుగా లక్ష చొప్పున పంట రుణాలు తీసుకుంటే వీరికి మాఫీ కాలేదు. ఆధార్‌కార్డుల పేర్లలో పొరపాట్లు, ఇతర కారణాలతోనూ రుణమాఫీ దక్కలేదు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రూ. 25 వేల చొప్పున నాలుగు విడుతల్లో రూ. లక్ష వరకు రుణమాఫీ జరిగింది. ఇప్పుడు పావు మందికి మాత్రమే రుణమాఫీ అయ్యిందని, అందరికీ కాలేదని రైతులు అంటున్నారు.

ములుగు జిల్లాలోని పంచోత్కులపల్లి గ్రామం

రేషన్‌కార్డు నిబంధన ఎత్తివేయాలి

భార్యకు, భర్తకు కలిపి రేషన్‌కార్డు ఒకటే ఉంటుంది. నా పేరు మీద రూ. 2 లక్షలు, నా భార్య పేరు మీద రూ. 2 లక్షల వరకు అప్పు ఉంది. గత ప్రభుత్వ హయాంలో పహాణీల ప్రకారంగా రూ. లక్ష చొప్పున రుణమాఫీ జరిగింది. రేషన్‌కార్డు నిబంధనతో మాకు రుణ మాఫీ వర్తించలేదు. ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డు నిబంధనలను ఎత్తివేయాలి.

- మాసిపెద్ది సత్యనారాయణరావు, పంచోత్కులపల్లి, ములుగు

సిద్దిపేట జిల్లా గొల్లకుంటలోని పోశమ్మగుడి వద్ద రుణమాఫీ అన్యాయంపై చర్చిస్తున్న గ్రామస్థులుఁ

గొల్లుమంటున్న గొల్లకుంట

- 35 మంది రైతులకు కాని రుణమాఫీ
- సర్కారు తీరుపై అన్నదాతల ఆగ్రహం

సిద్దిపేట, ఆగస్టు 19 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): ఒకటో విడతలో రుణమాఫీ కాలే.. రెండోవిడతలో వస్తదనుకున్నారు.. అయినా రాలేదు. మూడో విడతలోనైన పేరు ఉంటుందని ఆశపడితే నిరాశే మిగిలిందని సిద్దిపేట జిల్లా గొల్లకుంట గ్రామ రైతులు గొల్లుమంటున్నారు. 2 లక్షల రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కొర్రీలు పెట్టి రైతులకు మొండిచేయి చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం గొల్లకుంట గ్రామాన్ని నమస్తే బృందం సందర్శించింది. గొల్లకుంటలో సుమారుగా 200 మందికి పైగా రైతు కుటుంబాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసిందని సంబురపడ్డ రైతుల ఆశలకు ఆదిలోనే గండి పడ్డాయి. ఎక్కడ చూసినా రుణమాఫీ కాలేదని గ్రామ చావిడి వద్ద రైతులు ముచ్చటించుకుంటున్నారు. తొలి విడతలో లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తే కేవలం 71 మందికి, రెండో విడతలో 69 మందికి, మూడో విడతలో 35 మందికి రుణమాఫీ జరిగింది. ఈ చిన్న గ్రామంలో ఇంకా 35 మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఒక్క 200 మంది రైతులు ఉన్న ఒక గొల్లకుంటలోనే కాదు, మిగతా గ్రామాల్లోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. తక్షణమే గ్రామానికి అధికారులు వచ్చి రుణమాఫీ చేయాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

మంత్రి పొన్నం ఇలాకాలో రైతుకు ధోకా!

రుణమాఫీ ఉత్తముచ్చటే

నాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. అక్కన్నపేట గ్రామీణ బ్యాంకులో రెండేండ్ల కింద సుమారు 1.60 లక్షల వరకు రుణం తీసుకున్న. ఇప్పుడు రుణమాఫీ రెండు లక్షల వరకు మాఫీ అంటే బ్యాంకు పోయి అడిగిన. రుణమాఫీ కాలేదు అని చెప్పిండ్రు. చాలా బాధ అనిపించింది. రుణమాఫీ లేదు. ఏం లేదు. అంతా ఉత్తముచ్చట్ల లెక్కాగా మారింది. రుణమాఫీ గురించి ఎవరిని అడుగాలో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఈ నెల నుంచి బ్యాంకుల చుట్టు, అగ్రికల్చర్ ఆఫీసుల చుట్టు తిరుగుడే సరిపోతుంది. **-చింతల కనకయ్య, గొల్లకుంట, సిద్దిపేట జిల్లా**

నాలుగో విడత అంటుండ్రు..

నాకు రెండున్నర ఎకరాలు ఉంది. హుస్నాబాద్‌లోని కెనరా బ్యాంకులో 2018లో రుణం తీసుకున్న. రెగ్యులర్‌గా రెన్యువల్ చేయిస్తున్న. ప్రస్తుతం రూ. 1.32లక్షల రుణం ఉంది. నాకు రెండో విడతలో రుణమాఫీ కాలేదు. మూడో విడతలో కూడా జరగలేదు. అగ్రికల్చర్ వాళ్లను అడిగితే అప్లికేషన్ ఇస్తే నాలుగో విడతల వస్తదనే ముచ్చట చెప్తుతున్నారు.

-కాశబోయిన మాధవి, గొల్లకుంట, సిద్దిపేట జిల్లా

మొత్తం కుటుంబానికి మాఫీలేదు

అక్కన్నపేట తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మూడేండ్ల కిందట రూ. 60 వేలు లోను తీసుకున్నా. నా భర్త సమ్మయ్య కూడా ఇదే బ్యాంకులో రూ. 1.50 లక్షల రుణం తీసుకున్నడు. నాకు, నా భర్తకు ఎవరికీ రుణమాఫీ కాలేదు. మా తోటి కోడలు, మరిది కూడా బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. అసలు మొత్తం మా కుటుంబానికే రుణమాఫీ కాలేదు.

-కాశవేని చంద్రవ్వ, గొల్లకుంట, సిద్దిపేట జిల్లా

లోకం పోకడ

రుణమాఫీ చేయడం కుదరదంటారా? సరే.. దిష్టిబొమ్మలు కొనుక్కోవడానికి కొత్త రుణమైన ఇవ్వండి!

దళిత బిడ్డ రొడ్డ సుమన్ రైతే

- వ్యవసాయ శాఖ స్పష్టీకరణ
- ప్రభుత్వ ఉద్యోగి కాదని వివరణ
- నమస్తే తెలంగాణ కథనంపై ప్రభుత్వం ఆరా

నిజామాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతును ప్రభుత్వ ఉద్యోగిగా నమోదు చేసి రుణమాఫీకి మంగళంపాడిన వ్యవసాయశాఖ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దళిత రైతుకు జరిగిన అన్యాయంపై 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో 'దళిత రైతుకు దగా' శీర్షికన ప్రచురించిన కథనం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై సీఎంవో ఆరా తీసినట్టు తెలిసింది. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో ఉరుకులు పరుగులు పెట్టిన అధికారులు కమిషనరేట్‌కు పూర్తి వివరాలతో నివేదికను సమర్పించినట్టు సమాచారం. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన రొడ్డ సుమన్ రైతేనని మండల వ్యవసాయాధికారి పద్మ క్షేత్ర స్థాయిలో పర్యటించి ధ్రువీకరించారు. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన కూడా ఆయనకు అందుతున్నట్టు తేల్చారు. పొరపాటు ఎలా జరిగిందో వ్యవసాయ శాఖ చెప్పడం లేదు. 'నమస్తే' కథనం వల్ల రొడ్డ సుమన్‌ను ప్రభుత్వం రైతుగా గుర్తించి రుణమాఫీకి అర్హుడిగా నిర్ధారించారు. సుమన్ పేరిట ఉన్న రూ.1.92 లక్షల రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేసే అవకాశాలు ఉన్నాయి. రుణమాఫీ దక్కక తీవ్ర వేదనలో ఉన్న రొడ్డ సుమన్‌కు అండగా నిలిచిన 'నమస్తే తెలంగాణ' దినపత్రికను పలువురు రైతులు అభినందించారు.

ప్రభుత్వానికి నివేదించాం

'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన దళిత రైతుకు దగా కథనంపై కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేశాం. రొడ్డ సుమన్ రైతే. అతను ప్రభుత్వ ఉద్యోగి కాదు. ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తున్నాం. బాధిత వ్యక్తికి రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకుంటాం. డేటా కరెక్షన్‌కు ప్రభుత్వం త్వరలోనే అవకాశం కల్పించేందుకు కృషి చేస్తున్నది. తద్వారా సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

- వాజిద్ హుస్సేన్, వ్యవసాయాధికారి

రుణమాఫీ పూర్తికాలే

- డాటా క్లియర్‌గా ఉన్నవాళ్లకే జరిగింది
- ఇంకా 9.14 లక్షల మందికి కావాలి
- వడ్డీ చెల్లిస్తేనే రూ. 2 లక్షల రుణమాఫీ
- మాఫీ కానివారు దరఖాస్తు చేసుకోవాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టీకరణ
- రైతులకు డూప్లికేట్ ఖాతాలు
- వాటిని పరిశీలించాల్సి ఉన్నది: జూపల్లి

హైదరాబాద్, ఆగస్టు19 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, డాటా క్లియర్‌గా ఉన్న రైతులకే రుణమాఫీ అయిందని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.ప్రభుత్వ పాలసీ ప్రకారం వడ్డీ కడితేనే రూ. 2 లక్షల రుణం మాఫీ అవుతుందని స్పష్టం చేశారు. ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఎర్రమంజిల్‌లోని జలసౌధ లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ పథకంపై ప్రతిపక్ష పార్టీలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రుణమాఫీ పూర్తయిపోయిందని రైతులను పక్కదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తికాలేదని పేర్కొన్నారు. తాము చేసినట్టుగా రుణమాఫీ దేశ చరిత్రలో ఎప్పుడూ జరగలేదని, బీజేపీ ప్రభుత్వం ఏనాడూ రైతులను పట్టించుకోలేదని మండిపడ్డారు. అన్ని వివరాలు సరిగ్గా ఉన్న వారికి మాత్రమే ఆగస్టు 15 వరకు రుణాలు మాఫీ అయ్యాయని వివరించారు. ఆధార్‌లో తప్పులు, పాస్‌బుక్, ఆధార్‌లో పేర్లు సరిపోలకపోవడం, రేషన్‌కార్డు లేని కారణంగా 9.14లక్షల మందికి రుణమాఫీ కాలేదని, రూ 2 లక్షల లోన్‌కు సంబంధించి 8 లక్షల అకౌంట్లు ఉన్నాయని వెల్లడించారు. అవన్నీ కలిపితే దాదాపు 17.14లక్షల అకౌంట్లకు రుణమాఫీ కాలేదని తెలుస్తున్నది. అయితే, 8 లక్షల అకౌంట్లకు సంబంధించి రుణమాఫీ అయిందా? కాలేదా? అనే విషయంపై మాత్రం స్పష్టత నివ్వలేదు. రూ. 2 లక్షల పైన రుణం ఉన్నవారు వడ్డీ చెల్లిస్తేనే మాఫీ అవుతుందని పేర్కొన్నారు. ఏ కారణం చేతనైనా రుణమాఫీ పొందని రైతులు మండల వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డూప్లికేట్ అకౌంట్స్ ఉన్నాయని, వాటిని పరిశీలించాల్సి ఉందని చెప్పారు. ప్రచారం కోసమే రుణమాఫీపై ఖర్గేకు కేటీఆర్ లేఖ రాశారని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొన్నారు.

రైతుల అరెస్టులు హేయం

- నమ్మిన రైతులను నట్టేట ముంచారు
- అర్హులందరికీ రుణమాఫీ చేయాలి
- కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూ అప్రజాస్వామిక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించడం సిగ్గుచేటు అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో రుణమాఫీ కాలేదని నిరసన తెలిపిన రైతులను అరెస్టులు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. పోలీసు యాక్ట్ పేరుతో జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు హుకుం జారీ చేయడం హక్కులను కాలరాయడమేనని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులను ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు. కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరిగినా రుణమాఫీ కాకపోవడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రుణమాఫీకి పరిష్కారం చూపకుండా, పోలీసులను పురమాయించడం, అణగదొక్కే ప్రయత్నం చేయటం దుర్మార్గమని అన్నారు. ఆగస్టు 15లోపు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఆచరణలో అట్టర్‌ఫ్లాప్ అయ్యారని విమర్శించారు. నమ్మి ఓటేసిన రైతన్నను నట్టేట ముంచారని మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లుతెరిచి రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతన్నలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతన్నలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

రైతురాజ్యం కాదిది.. పోలీస్ రాజ్యం

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ): రైతు రాజ్యం కాదిది ..పోలీసు రాజ్యం అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో సర్కారు తీరుపై ధ్వజమెత్తారు. రూ.15000 కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టి రూ.17,869 కోట్లు రుణమాఫీ చేసి రూ. 2 లక్షల వరకు రుణాలు తీర్చేశాం అని చెప్పుకోవటం సర్కారు దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. రుణాలన్నీ మాఫీ చేస్తే రాష్ట్రంలో రైతులు రోడ్డెందుకు ఎక్కుతున్నారని ప్రశ్నించారు. సీఎం, మంత్రుల చేసిన అబద్ధపు ప్రకటనలే రైతుల ఆందోళనకు కారణమని చెప్పారు. రానున్న రోజుల్లో రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి పాడెకడ్తారని చెప్పారు. రైతులకు క్షమాపణలు చెప్పి, కేసులను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయండి

- కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్ విద్యానగర్/ఫర్టిలైజర్‌సిటీ, ఆగస్టు 19: రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చి పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ అవినీతిపై బీజేపీ ఫోకస్ పెట్టిందని చెప్పారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసేదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలేది లేదని స్పష్టంచేశారు. సోమవారం కరీంనగర్‌తోపాటు గోదావరిఖనిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. ₹40వేల కోట్లు రుణమాఫీ చేస్తామని చెప్పి ₹17 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి సోనియాగాంధీనే మోసం చేసిన ఘనులు కాంగ్రెస్ నాయకులని విమర్శించారు.

రైతన్నలపై పోలీసు ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి...

శవయాత్ర నిర్వహించారు. దీంతో పోలీసుల 11 మంది రైతులపై కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన నిమ్మల సుదర్శన్‌రెడ్డి, పుంజ్రూ పోతారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కుమ్మరి భూమన్న, విపుల్‌రెడ్డి, సూర్యసేన్‌రెడ్డి, గోక లక్ష్మారెడ్డి, నక్క ధనుంజయ్, దత్తు, సతీశ్‌రెడ్డి, నర్సింహులపై కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు అదుపులోకి తీసుకొని రాత్రి 10.30 గంటల వరకు పోలిస్‌స్టేషన్‌లో నిర్బంధించారని బాధితులు వాపోతున్నారు. తమపై ఎవరు ఫిర్యాదు చేశారని అడిగినా చెప్పలేదని పేర్కొన్నారు. జిల్లాలో ఆగస్టు ఒకటో తేదీ నుంచి పోలీస్ యాక్ట్‌లోని సెక్షన్ 30 అమల్లో ఉన్నదని అధికారులు చెప్తున్నారు. నిబంధనలు ఉల్లంఘనతోపాటు పోలీసుల విధులకు ఆటంకం, సీఎం హోదాలో ఉన్నవారిని అవమానపర్చేలా వ్యవహరించినందుకు కేసు నమోదు చేసినట్టు అధికారులు చెప్తున్నారట. ఈ ఘటనపై సోమవారం రుయ్యాడి రైతు వేదికలో రైతులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అన్నదాతలపై ప్రభుత్వం కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. రుణమాఫీ అడిగితే కేసులు పెడతారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కొనసాగింపుగా సోమవారం ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ పోలీస్‌స్టేషన్‌లో మరో నలుగురు రైతులపై కేసు నమోదుచేశారు. ముందస్తు అనుమతి తీసుకోకుండా ర్యాలీ, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసినందుకు రైతులు డబ్బుల చంద్రశేఖర్,అలికి గణేశ్, తురాటి భోజన్న, చెట్ల వినీల్‌పై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై అప్పారావు తెలిపారు. ఒక్క ఆదిలాబాద్‌లో మాత్రమే కాదని, ఇతర అన్ని జిల్లాల్లోనూ రైతులు రోడ్డెక్కితే కేసులు పెట్టాలని పోలీసులు నిర్ణయించినట్టు చెప్తున్నారు.

రైతులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

షరతులు లేని రుణమాఫీ చేస్తామన్నారు. ఇదే విషయాన్ని నిరసన ప్రదర్శన ద్వారా అడిగాం. నేను ఉన్నత విద్యాభ్యాసం చేసినా ఉద్యోగాలు లేక వ్యవసాయం చేస్తున్నా. ధర్నాను వక్రీకరించి రాజకీయ ఒత్తిళ్లతో ఓ మంత్రి ద్వారా రైతులపై కేసులు బనాయించారు. రైతులకు అన్యాయం జరిగితే ఎవరూ ప్రశ్నించవద్దన్నట్టు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

- సతీశ్‌రెడ్డి, రుయ్యాడి, తలమడుగు మండలం, ఆదిలాబాద్ జిల్లా

మీరంతా ఏం చేస్తున్నట్టు?

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నిరసనలపై నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనాలు ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పోలీసుల సమక్షంలోనే ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న ఫొటోలపై ప్రధానంగా చర్చ జరిగినట్టు తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. డీజీపీ, ఇంటెలిజెన్స్ డీజీ, తదితర ఉన్నతాధికారులతో మాట్లాడారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కండ్ల ముందే దిష్టిబొమ్మలను తగలబెడుతుంటే ఏం చేస్తున్నట్టు? అని సీఎం ప్రశ్నించినట్టు సమాచారం. ఈ వ్యవహారంతో ప్రభుత్వం పరువు పోయిందని,రుణమాఫీ బూడిదలో పోసిన పన్నీరైందని అసహనం వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. రైతుల నిరసనలను కట్టుదిట్టం చేయాలని ఆదేశించినట్టు సమాచారం. పోలీసు ఉన్నతాధికారులు ఆదిలాబాద్ జిల్లా ఉన్నతాధికారులతో మాటాడినట్టు తెలిసింది.దీంతోపాటు ఆయా జిల్లాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. రైతులు రోడ్డెక్కకుండా చూసుకోవాలని మౌఖికంగా ఆదేశించినట్టు తెలుస్తున్నది. ఎవరైనా రైతులు, నేతలు అనుమతులు కోరినా ఇవ్వవద్దని స్పష్టంగా చెప్పినట్టు సమాచారం. నియంత్రణకు ఇంటెలిజెన్స్‌ను వాడాలని, ఎక్కడైనా రైతులు ఆందోళనకు దిగే పరిస్థితులు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని గ్రామస్థాయి అధికారులకు చెప్పాలని సూచించినట్టు సమాచారం. ఎక్కడైనా నిరసన చేసే పరిస్థితులు ఉంటే.. పోలీసులు వెంటనే వెళ్లి 'ఏదో ఒక రకంగా' రైతులను ఒప్పించి, రోడ్డెక్కకుండా చూడాలని స్పష్టం చేసినట్టు తెలిసింది.

రైతుల గోస ఎందుకు అర్థంకావడం లేదు?

మా గ్రామంలో 80 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా గోసను ప్రభుత్వం అర్థం చేసుకోక కేసులు బనాయిస్తున్నది. గ్రామంలో రైతులందరం కలిసి పోలీసు కేసులను ఎదుర్కొంటాం. రైతుల ఆందోళనలు రాజకీయ పార్టీలకు ముడిపెట్టడం సరికాదు. శవయాత్రలో పాల్గొన్న వారు నిజమైన రైతులో కాదో ప్రభుత్వం నిర్ధారించుకోవాలి.

- విపుల్‌రెడ్డి, రైతు, రుయ్యాడి, తలమడగు మండలం, ఆదిలాబాద్ జిల్లా

రుణమాఫీ చేయాలని అడిగే హక్కులేదా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చమని అడిగినందుకు ప్రభుత్వం పోలీసు కేసులు బనాయిస్తున్నది. రైతుగా పుట్టడం మేము చేసుకున్న తప్పా. రుణమాఫీ చేయమని అడిగే హక్కు రైతులకు లేదా? రాజకీయ ఒత్తిళ్లతో మాపై కేసులు బనాయించారు. తమపై ఎవరు ఫిర్యాదు చేశారు. ఎందుకు అరెస్టు చేస్తున్నారని అడిగితే పోలీసులు సమాధానం చెప్పకుండా ఐదు గంటలకు పైగా నిర్బంధించారు.

- దత్తు, రైతు, రుయ్యాడి గ్రామం, తలమడుగు మండలం, ఆదిలాబాద్

'పోలీస్ హరాస్‌మెంట్.. షాప్ క్లోజ్డ్'

దుకాణం ముందు స్వీట్ హోం నిర్వాహకుల ఫ్లెక్సీ.. షాప్ యజమానిపై కేసు నమోదు

వినాయక్‌నగర్, ఆగస్టు 19: నిజామాబాద్‌లో ఓ మిఠాయి దుకాణం యజమాని పోలీసుల వేధింపులపై వినూత్నంగా నిరసన తెలిపారు. తన దుకాణం ఎదుట 'షాప్ ఈజ్ క్లోజ్‌డ్ డ్యూటూ పోలీస్ హరాస్‌మెంట్' అనే ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. రక్షాబంధన్ సందర్భంగా ఆదివారం ఫ్లెక్సీ ఏర్పాటుచేసి దుకాణం మూసి ఉండడంతో వినియోగదారులు విస్మయానికి గురయ్యారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌రోడ్డులో ఉన్న ఢిల్లీవాలా స్వీట్‌హోంకు వచ్చే వినియోగదారులు వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కాకూడదని పోలీసులు తెలుపడంతో షాపు నిర్వాహకులు పోలీసుల వేధింపుల కారణంగానే షాపును మూసివేస్తున్నట్టు ఆదివారం పెద్ద ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. దుకాణ యజమాని తప్పుడు ప్రచారం చేస్తున్నారని పోలీసులు సోమవారం కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

స్పీకర్‌కు మాఫీ

మొదటిపేజీ తరువాయి...

తమ ప్రజాప్రతినిధులకు మాత్రం ఏ మాత్రం ఆలోచించకుండా మాఫీ అమలు చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వికారాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ప్రభుత్వం తాండూరు పీఏసీఎస్‌లో ఆయన తీసుకున్న రూ.1.50 లక్షల రుణాన్ని మాఫీ చేసింది. షరతులు పెట్టి జిల్లాలోని సుమారు 80 వేల మంది పేద రైతులకు నష్టం చేసిన ప్రభుత్వం.. స్పీకర్‌కు రుణమాఫీ వర్తింపజేయడంతో జిల్లాలో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. తమకు సవాలక్ష కొర్రీలు పెట్టి కోత విధించి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల రుణాలను మాఫీ చేయడంతో జిల్లా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశం రాష్ట్ర వ్యాప్తంగా కూడా చర్చనీయాంశంగా మారింది. స్పీకర్ ప్రసాద్‌కుమార్ తీసుకున్న రూ.1.50 లక్షల రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేయడంతో సర్వత్రా విమర్శలు రావడంతో ఆయన అప్రమత్తమైనట్టు తెలిసింది. మాఫీ అయిన సొమ్మును తిరిగి ప్రభుత్వానికి